www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 14 ఏప్రిల్ 2023
5
వైఎస్ఆర్

ఎంఎఫ్‌యూ భవనానికి స్థల పరిశీలన

కడప అర్బన్ : వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయం నూతన భవనాల నిర్మాణానికి సంబంధించి పెండ్లిమర్రి మండలం గంగనపల్లెలో 110.36 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. గురువారం ఆ భూమిని వైస్ ఛాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి పరిశీలించారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వం కేటాయించిన భూమిని విశ్వవిద్యాలయానికి అప్పజెప్పాల్సి ఉన్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అనంతరం స్థానిక విలేకరులు, సర్వేయర్ సుబ్బరాయుడు విశ్వవిద్యాలయానికి కేటాయించిన స్థలాన్ని హద్దులను అధికారులకు చూపించారు. ఈ సందర్భంగా వీసీ, రిజిస్ట్రార్లు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు భూమిని అప్పజెప్పిన వెంటనే కంచెవేసి, చదునుచేసే పనులను ప్రారంభించాలని సూచించారు. అన్ని పనులు సజావుగా సాగితే జూలై 8న నాటికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించేందుకు కృషిచేస్తామని తెలిపారు.

వెనుకబడిన ప్రాంతాలకు వెన్నుపోటు!

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల అమలుకు వ్యతిరేకంగా ప్రచార భేరి మోగింది. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నెలాఖరు వరకు దేశవ్యాప్తంగా మోడీని గద్దెదించండి...దేశాన్ని కాపాడండి అనే నినాదంతో పెద్దఎత్తున ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. కేంద్ర ప్రభుత్వం దేశంలోని ఆయా రాష్ట్రాలకు, ఆయా ప్రాంతాలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించనుంది. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల కుదింపు, కార్మిక, కర్షక ప్రయోజనాలు, లేబర్ కోడ్‌ల కుదింపు, బడుగు, బలహీన వర్గాల ప్రయోజనాన్ని దెబ్బతీసే విధానాలకు వ్యతిరేకంగా సమరశంఖం పూరించనుంది. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల నిధుల్ని రాష్ట్ర ఖాతా నుంచి వెనక్కి తీసుకోవడం, రాయలసీమ డిక్లరేషన్ అమలు, కడప జిల్లాకు ఇచ్చిన సెయిల్ ఆధ్వర్యంలోని ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వంటి హామీల అమలులోని కాపట్యాన్ని ప్రశ్నిస్తూ వామపక్షాలు ప్రచార భేరి చేపట్టనుండడంపై కథనం...

- కోల్డ్ స్టోరేజీలోకి కడప-బెంగళూరు రైల్వేలైన్
- సెయిల్ ఆధ్వర్యంలో 'ఉక్కు'కు మొండిచేయి
- అమలుకు నోచని రాయలసీమ డిక్లరేషన్
- నేటి నుంచి వామపక్షాల ప్రచార భేరి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కేంద్రం రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు చేసిన అన్యాయంపై మరోసారి పెద్దఎత్తున గళం వినినిపించనుంది. వామపక్షాల ఆధ్వ ర్యంలో ప్రచారభేరి మోగిం చాయి రాష్ట్ర విభజన చట్టంలోని ప్రధాన హామీలైన రాయలసీమ ఉత్తరాంధ్ర వంటి వెనుకబడిన జిల్లాలకు ఏటా రూ.50 కోట్ల చొప్పున ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయకపోవడంపై ప్ర చారం సాగి ంచనుంది. నాలుగేళ్ల కిందట రాష్ట్ర ఖాతాకు బదిలీ చేసిన రూ.350 కోట్లను వెనక్కి తీసుకోవడం చర్చనీయాంశంగా మారనుంది. సెయిల్ ఆధ్వర్యంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలనే రాష్ట్ర విభజన హామీని అమలు చేయకపోవడంపై గళం విప్పనుంది. వెనుకబడిన ప్రాంతమైన కడప జిల్లా నుంచి ఉపాధి నిమిత్తం హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు, గల్ఫ్ దేశాలైన కువైట్, సౌదీ, కతార్, బహ్రెయిన్ వంటి దేశాలకు లక్షలాది మంది వలసలు వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది. వెనుకబడిన ప్రాంతంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తే ప్రత్యక్ష, పరోక్షంగా సుమారు లక్ష మంది నిరుద్యోగులకు ఉపాధి లభించే అవ కాశం ఉంది. కడప -బెంగళూరు రైల్వేలైన్ కేంద్ర ప్రభుత్వ సంకుచిత వైఖరి కారణంగా కోల్డ్ స్టోరేజీకి చేరుకోవడం ఆందోళన కలిగి స్తోంది. రాష్ట్ర ప్రభు త్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేదనే పేరుతో జాతి భవితకు ముడిపడిన రైల్వేలైన్‌ను మూలన పడేయడం ఎంతవరకు సమంజసమనే విమర్శ వినిపిస్తోంది. కర్షక వ్యతిరేక విధానాల్లో భాగంగా రైతుల మోటార్లకు మీటర్లు బిగించడం వంటి విద్యుత్ రెగ్యులేటరీ చట్టాల్లో మార్పులు తీసుకురావడం వంటి విధానాలను నిలువరించాల్సి ఉంది. బిజెపి ప్రవచిత రాయలసీమ డిక్లరేషన్ అమలు అటకెక్కించింది. ఇచ్చిన హామీల అమలుకు ఎన్నికల ప్రయోజనాలే పరమావధిగా ఉంటాయనే వాదనకు బలం చేకూరుతోంది. ఆయుష్మాన్ భారత్ పథకం లేకపోవడంతో అమలు అంతంత మాత్రమేనని తెలుస్తోంది.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా వామపక్షాలు తలపెట్టిన మోడీని గద్దెదిం చండి...దేశాన్ని కాపాడండి అనే నినాదంతో చేపట్టిన ప్రచారభేరి కార్యక్రమాన్ని ఆదరించి, ప్రత్యామ్నాయ విధానాలను బలపంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

కార్పొరేట్ విధానాలను తిప్పికొట్టాలి

దేశంలోని కార్పొరేట్ అనుకూల విధానాలను తిప్పికొట్టాలి. వాటి స్థానంలో ప్రత్యామ్నాయ ఆర్థిక విదానాలను అమలు చేయాలి. బడుగు, బలహీన వర్గాల ప్రయోజనాలకు పెద్దపీట వేయాలి. పేదల, అనుకూల ఆర్థిక విధానాలను అమలు చేయాలనే ఉద్దేశంతో వామపక్షాలు చేపట్టిన మోడీని గద్దెదించండి ...దేశాన్ని కాపాడండి అనే నినాదంతో తలపెట్టిన ప్రచారభేరిని జయప్రదం చేస్తాం.

- జి.చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శి, కడప.

ప్రత్యామ్నాయ విధానాలే శరణ్యం

కార్పొరేట్ అనుకూల విధానాలకు ప్రత్యామ్నాయ విధానాల ద్వారా సమాధానాలు చెప్పాలి. దేశంలోని గుప్పెడు పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడుతూ సాగుతున్న ఆర్థిక క్రమాన్ని మార్చాల్సి ఉంది. వామపక్షాలు దేశవ్యాప్తంగా చేపట్టిన మోడీని గద్దెదించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో చేపట్టిన ప్రచార భేరిని జయప్రదం చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశాం.

- గాలి చంద్ర, సిపిఐ, జిల్లా కార్యదర్శి, కడప.

పక్కా ప్రణాళికతో విద్యాకానుక పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యాకానుక పంపిణీపై చర్చిస్తున్న ఎస్ఎస్ఎ పిఒ అంబవరం ప్రభాకర్‌రెడ్డి

జగనన్న విద్యా కానుక - 4 పంపిణీకి పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నామని సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర పరిశీలకులు అల్లం సత్యనారాయణ తెలిపారు. జగనన్న విద్యా కానుక స్టోరేజీ పాయింట్లను రాష్ట్ర పరిశీలకులు జిల్లా వ్యాప్తంగా పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డిని కలిసి జిల్లాలోని వివిధ స్టోరేజీ పాయింట్ల వివరాలను భద్రతకు చేపట్టాల్సిన చర్యలను చర్చించారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి మండల వారీగా ప్రత్యేక టీమ్‌ల ను ఏర్పాటు చేసి జగనన్న విద్యా కానుక సకాలంలో విద్యార్థులకు అందేటట్లు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. రాష్ట్ర కార్యాలయ ఆదేశాల మేరకు జగనన్న విద్యా కానుక భద్రతకు అన్ని చర్యలు చేపడతామన్నారు. అందుకు సంబంధించి జిల్లా, మండల స్థాయిలలో కమిటీలను సిద్ధం చేశామన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కిట్ల భద్రతపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల ప్రారంభం నాటికి కమిటీల ద్వారా కిట్లను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్క విద్యార్థికి కిట్లను సకాలంలో అందించేటట్లు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. జగనన్న విద్యా కానుక పంపిణీలో ఎదురవుతున్న సమస్యలను రాష్ట్ర పరిశీలకులకు వివరించారు. రాష్ట్ర పరిశీలకులు సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని స్టోరేజీలను పరిశీలించామని మండల విద్యాధికారులతో మాట్లాడి భద్రతకు తీసుకోవాల్సిన చర్యలను సూచించామన్నారు. జిల్లాలో జెవికె కిట్ల భద్రతపై ఆయన సంతృప్తిని వ్యక్తపరిచారు. సమావేశంలో సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారులు మిట్టా కేశవరెడ్డి, కొండా దశరథరామ్ రెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి- కడప అర్బన్

కమలాపురం ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయంలో పనిచేస్తూ అవినీతి అక్రమాలకు పాల్ప డుతున్న సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరయ్యను తక్షణం సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ బదిలీలు, ఉద్యోగోన్నతుల విషయంలోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. 11వ వార్డులో ఉన్నటువంటి కార్యకర్త బదిలీ కావాలని కోర్టుకు వేసినప్పటికీ పట్టించుకోకుండా పదో వార్డులో నివాసమున్న తులసి అనే అమ్మాయికి11వ వార్డులో వర్కర్‌గా పోస్ట్ ఇచ్చారని పేర్కొన్నారు. సిఐటియు గా అర్హులైన హెల్పర్స్‌కు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈశ్వరయ్య ఎప్పుడు చూసినా పీడీ ఆఫీసులో ఉంటారని తెలిపారు. ఆయనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఆయాలకే ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. కలెక్టర్ విచారించి పుష్పలతకు ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి. లక్ష్మీదేవి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

విశ్రాంత ఆర్‌డికి రెండేళ్లు జైలు శిక్ష, జరిమానా

ప్రజాశక్తి - కడప

మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ శాఖకు చెందిన విశ్రాంత రీజనల్ డైరెక్టర్ కత్తి ఆనంద్‌కు కర్నూలు ఎసిబి కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించింది. ఈ మేరకు గురువారం కర్నూలుఎసిబి కోర్టు తీర్పు వెల్లడించింది. 2013లో నిందితుడు స్టాఫ్ నర్స్ మజ్జార అరుణ ఓబులవారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేసేందుకు రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో కర్నూలు ఎసిబి కోర్టు ఆయనకు రెండేళ్లు కారాగార శిక్ష, రూ. 25 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే మరో ఆరునెలలు సాధారణ శిక్షణ అనుభవించాలని తిరుపతి రేంజ్ ఎసిబి డిఎస్‌పి, కడప రేంజ్ ఇన్‌ఛార్జి పి. కంజాక్షన్ పేర్కొన్నారు.

సమస్యలుంటే సంప్రదించండి : జడ్జి

ప్రజాశక్తి - కడప

ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థలను సంప్రదించవచ్చునని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత అన్నారు. గురువారం కడప నగరం ప్రకాష్ నగర్‌లోని స్నేహాలయ నిరాశ్రయుల వసతి గృహాన్ని జడ్జి సందర్శించారు. అక్కడున్న నిరాశ్రయులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ సిటిజన్ టోల్ ఫ్రీ నెంబర్ 14567 పైన అవగాహన కలిగించారు.

జన వికాస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇఫ్తార్ విందులో నాయకులు

నగరంలోని మారుతీనగర్‌లో ఉన్న జనవికాస్ సేవా సమితి కార్యాలయంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాహిర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్య క్రమంలో వైసిపి నాయకులు డాక్టర్ సోహైల్, అఫ్జల్ ఖాన్, టిడిపి నాయకులు గోవర్ధన్ రెడ్డి, జిలాని బాషా, ఎం.ఎం హాస్పిటల్స్ అధినేత డాక్టర్ మహబూబ్ పీరా, కాంగ్రెస్ నాయకులు నజీర్ అహ్మద్,వికాస్ గ్రూప్ కరెస్పాండెంట్ మున్నా, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, డాక్టర్ రాబని, డాక్టర్ ఆసిఫ్, డాక్టర్ శ్రీనివాసులు,అప్నా కడప అధినేత ఫజల్ పాల్గొన్నారు.

16న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కడప

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న కడప నగరంలోని మస్తాన్‌వలి వీధిలో ఉన్న ఫాలోఅప్ చెస్ అకాడమీలో 15వ అష్రాఫ్- ప్రసన్న మంత్లీ రూలింగ్ ట్రోఫీ జస్ట్ టోర్నమెంట్‌ను నిర్వ హిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి ఒక ప్రకట నలో తెలిపారు. విజేతగా నిలిచిన క్రీడాకారునికి రూ. 2100 బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరచిన పది మంది క్రీడాకారులకు ట్రోఫీలు, 24 మెడల్స్, పాల్గొన్న ప్రతి క్రీడాకారునికీ సర్టిఫికెట్స్ అందజేయనున్నట్లు తెలిపారు.చీఫ్ ఆర్బిటర్‌గా నెల్లూరుకు చెందిన క్వాలిఫైడ్ సీనియర్ నేషేన్ అర్బిటర్ రామలక్ష్మణ్ వ్యవహ రిస్తారన్నారు. పోటీలలో వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నవచ్చని తెలిపారు.

ఆన్‌లైన్ క్విజ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప

ఆన్‌లైన్ క్విజ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్

ఆశయాలు ఆ చరణలో పెడితే విద్యా ర్థులందరూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లాంటి మహనీయులు అవుతారని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా గురువారం రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ బటన్ నొక్కి ప్రారంభించారు. రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ పి హరి ప్రసాద్ మాట్లాడుతూ రాజనీతిజ్ఞుడు, న్యాయ కోవిదుడు అయిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి జీవిత చరిత్ర విద్యార్థులందరికీ ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చక్రవర్తి, శివరాం, డా. నీలయ్య, రవి శేఖర్, రామకృష్ణ, రామచంద్ర, డాక్టర్ వై. సావిత్రి, రాఘవేందర్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

దూదేకుల అభివృద్ధిపై చర్చకు సిద్ధం

ప్రజాశక్తి - కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న మన్నూరు అక్బర్

టిడిపి యు వ నేత నారా లోకేష్ ఆధ్వర్యంలో దూదేకుల అభి వృద్ధిపై ప్రభు త్వంతో చర్చకు సిద్ధమని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ పేర్కొ న్నారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లా డారు. టిడిపి ం ప్రభుత్వం హయాంలో దూదేకుల ఫెడరేషన్ ద్వారా అనంతపురం, ఒంగోలులో జాబ్ మేళా, ప్రొద్దుటూరులో ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. చంద్రబాబు నాయుడు దూదేకులకు మొట్ట మొదటిసారిగా ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.40 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. చంద్రబాబు హామీ మేరకు చట్ట సభల బదులు జడ్‌పి చైర్మన్, ఎపి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మేయర్, కేబినేట్ పదవులు ఇచ్చారని, దూదేకులను చట్ట సభలకు తీసుకెళ్లేందుకు చంద్రబాబు, లోకేష్ కట్టుబడి ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రస్తుత వైపిసి ప్రభుత్వం దూదేకుల్లో ఒకరికైనా కేబినెట్ పదవి ఇచ్చారా అని ప్రశ్నించారు. వైసిపి నిరంకుశత్వం వల్ల మంగళగిరిలో బిసి సర్టిఫికెట్ ఇవ్వని కారణంగా దూ దేకుల సోదరీ ఎంపిపి కాలేక పోయిందని పేర్కొన్నారు. సమావేశంలో మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి గగ్గుటూరు నజీర్, నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, రూపనగుడి హుస్సేన్, ప్రొద్దుటూరు నజిర్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి బీమా పంపిణీ

కడప అర్బన్ : ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ జి.వెంకటశివ సతీమణి లక్ష్మి ప్రసన్నకు రూ. 21. 40 లక్షల బీమా మొత్తాన్ని ఎస్‌పి అన్బురాజన్ చెక్కు రూపంలో అందజేశారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో చెక్కు అందచేశారు. కానిస్టేబుల్ వెంకటశివ కుటుంబ యోగక్షేమాలు విచారించారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్‌కు నీలి శ్రీనివాసరావు రాజీనామా

రాజీనామా పత్రాలను చూపుతున్న నీలి శ్రీనివాసరావు

కడప : కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావుకు తన పదవికి రాజీనామా చేశారు. 1998 డిఎస్‌సికి సంబంధించి నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయనకు ఉదోగ్యం వచ్చింది. సిద్ధవటం దిగవపేటలో టీచరుగా నియమిస్తూ జిల్లా విద్యా శాఖ అధికారి రాఘవరెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండున్నరేళ్లుగా పార్టీకి కడప జిల్లా అధ్యక్షుడిగా సేవలందించానని, 25 ఏళ్ల నాటి టీచర్ పోస్టు ఒక కలగా ఉండేదని, ఆకల నెరవేరుతున్న సందర్భంలో అధ్యక్ష పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా సమర్పిస్తున్నట్లు తెలిపారు. పార్టీలో తనకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

సైన్సు పరీక్షకు 180 మంది గైర్హాజర్

కడప అర్బన్ : పదవ తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా గురువారం సైన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 27,704 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 180 మంది గైరహాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 56, డీఈవో 8 కేంద్రాలను పరిశీలించారు.

కెఎస్ఆర్ఎంలో రాష్ట్ర స్థాయి ఫెస్ట్ ఆరంభం

కడప అర్బన్ : నగర శివారులోని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర స్థాయి ఫెస్ట్ కనెక్ట్-2కె23 కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథి కళాశాల పూర్వ విద్యార్థిని (2009-13), రాజమండ్రి డిఎస్‌పి శ్రీలత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాలుగేళ్ల ఇంజినీరింగ్ విద్యలో ఇటు తల్లిదండ్రులకు, కళాశాలకు, భావితరాలకు స్ఫూర్తిగా ఉండాలని చెప్పారు. అటు సమాజానికి ఉపయోగపడే విధంగా ఇన్నోవేటివ్, కొత్త ఆవిష్కరణలుండాలని పేర్కొన్నారు. అధ్యాపక సిబ్బంది మార్గదర్శకాలను, సలహాలను పాటించి ఉన్నత రంగాలలో స్థిరపడాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ కృషి పట్టుదలతో ఉంటే ఏదైన సాధించవచ్చునని తెలిపారు. తాము చదువుకున్నప్పటి నుంచి నేటికీ కళాశాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశారని పేర్కొన్నారు. పటిష్ట ప్రణాళికతో లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఇలాంటి కార్యక్రమం ద్వారా విద్యార్థులలో ప్రతిభను, ఆధునిక సాంకేతికను వెలికితీయడానికి దోహదపడతాయని అతిథులు పేర్కొన్నారు. ప్రముఖ సంస్థలతో ఆదిత్య బిర్లా గ్రూప్, ట్రయోవిజన్, ఇండియన్ సర్వీసెస్, ఐబీఎం, వంటి సంస్థల ముఖ్య కార్యనిర్వాహక సిబ్బందికి సన్మానం చేశారు. అనంతరం వివిధ శాఖల వారీగా టెక్నికల్ (1850), నాన్ టెక్నికల్(550) మంది విద్యార్థులు ఆయా ఈవెంట్ల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విద్యార్థులు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఫస్ట్‌లో పాల్గొనడం తమకెంతో సంతోషంగా ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కందుల మదన్మోహన్ రెడ్డి, కరస్పాండెంట్, ట్రెజరర్ కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, వివిధ శాఖల అధిపతులు, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ వెంకట రమణ, సమన్వయకర్త లీనా రాస్తాపూర్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది వివిధ కళాశాల నుంచి విచ్చేసిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి జోన్-5 సమావేశానికి ఏర్పాట్లు

కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 18న జోన్-5 సమావేశానికి విచ్చేయుచున్నారు. మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గురువారం బిల్డప్ వద్ద సమావేశ ఏర్పాట్లను పరిశీలించారు. 38 నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, క్లస్టర్లు, యూనిట్ ఇన్‌ఛార్జులు హాజరుకానున్నారు. ఈ సదస్సులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని విజయవంతం చేయాలని జిల్లా నాయకులకు సూచించారు.

ఏడీ సెట్ కమిటీ చైర్మన్‌గా బి.ఆంజనేయ ప్రసాద్

కడప అర్బన్ : బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రవేశాలకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆర్ట్స్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏడీ సెట్) -2023కు కమిటీ చైర్మన్‌గా కడప డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య బి.ఆంజినేయ ప్రసాద్ నియమితులయ్యారు. కమిటీ ఛైర్మెన్‌గా నియమించినందుకు రిజిస్ట్రార్ ఆచార్య ఇసి సురేంద్రనాథ్ రెడ్డి, వైస్ ఛాన్సలర్‌కు అభినందనలు తెలియజేశారు. ఏడీ-సెట్ కన్వీనర్‌గా డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ రిజస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్ రెడ్డి నియమితలయ్యారు. ఈ మేరకు గురువారం ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు

భూములు కోల్పోయాం.. పరిహారం ఇవ్వండి

అధికారులకు బాధితుల వేడుకోలు

విస్తరణలో భాగంగా అధికారులు సేకరించిన రోడ్డు పక్కనున్న పొలం

ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్

పోరుమామిళ్ల నుంచి సింగరాయకొండ 167- బి నాలుగు లైన్ల రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన బాధితులు తమకు పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. 4లైన్ రోడ్డు విస్తరణ కోసం నిర్వహించిన సర్వేలో 1185 సర్వే నెంబర్ వ్యవసాయ పొలంలో నష్టపోయిన 37 మందికి నష్టపరిహారం అందింది. మరికొంత మందికి నష్ట పరిహారం ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచారు. షేక్ హుస్సేన్ పీరాకు చెందిన 46 సెంట్లు, ముత్తుముల మల్లికార్జున రెడ్డికి చెందిన 45 సెంట్ల భూమి, ఇల్లు, షఫియా బేగంకు చెందిన 19 సెంట్లు భూమి కి నష్టపరిహారం ఇవ్వలేదు. పోరుమామిళ్ల మండల సర్వేయర్ ఉస్మాన్ జానీ బినామీలతో కుమ్మక్కై రైతులను, అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. 1185లో భూమి తమ అనుభవంలో ఉన్నట్లు బాధితుల వద్ద రికార్డులున్నాయి. హుస్సేన్ పీరా 20 ఏళ్లు, సఫియా 5 ఏళ్లు, మల్లికార్జున 20 ఏళ్లు తమ ఆధీనంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆర్‌డిఒ, తహశీల్దార్‌కు పలుమార్లు అర్జీలు సమర్పించినా పరిష్కారం అందలేదని వాపోతున్నారు. సగిలి విజయ్ కుమార్, వి. బాల గురయ్య అనే వ్యక్తులు తప్పుడు పత్రాలను సృష్టించుకుని తమల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంతో అధికారులు పరిహారం పెండింగ్‌లో ఉంచారని పేర్కొన్నారు. బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి, పోరుమామిళ్ల మండల రెవెన్యూ అధికారి తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు.

తప్పుడు పత్రాలతో ఇబ్బంది పెడుతున్నారు

నాకు రంగసముద్రం గ్రామ పొలంలో సర్వే నంబర్ 1185లో 45 సెంట్ల పొలం ఉంది. అక్కడే ఇల్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. నాలుగు లైన్ల రోడ్డు కోసం భూమిని తీసుకున్నారు. ఇప్పుడు తప్పుడు పత్రాలతో మాకు పరిహారం రాకుండా ఇబ్బంది పెడుతున్నారు. అధికారులు కలుగజేసుకుని న్యాయం చేయాలి.

-మల్లికార్జునరెడ్డి, రంగసముద్రం.

పరిహారం రాకుండా అడ్డుకుంటున్నారు

సర్వే నంబర్ 1185లో 46 సెంట్ల భూమి ఉంది. కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి పరిహారం రాకుండా అడ్డుకుంటున్నారు. సగిలి విజయ్‌కుమార్, వీరపోగు గురయ్య అలియాస్ రవి అన్యాయం చేస్తున్నాడు. అధికారులు విచారించి మాకు న్యాయం చేయాలి. లేకపోతే కుటుంబం వీధిన పడాల్సి వస్తుంది.

- హుస్సేన్‌పీరా, రంగసముద్రం.

పేదల కోసం శ్రమిస్తున్న సిఎం జగన్ : ఎంపీ

ప్రజాశక్తి - వేంపల్లె

పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వీరన్నగట్టుపల్లెలో రెండవ రోజు గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచులు చలపతి, రాచినేని శ్రీనివాసులు, కృష్ణతేజ, శ్రావణ్‌కుమార్, గోపి, దర్బార్, చానుబాషా, పుల్లయ్య, మల్లయ్య, శంకరయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఖాజీపేట : వైసిపి ప్రభుత్వం ఎన్నికల నాటి సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మిడుతూరు పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. టిడిపికి చెందిన వారికి కూడా పెద్ద ఎత్తున ప్రభుత్వ పథకాలు అందాయన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా ప్రజలందరూ జగన్‌కే పట్టం కట్టాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఏపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ డి.గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, బిఎంబి బాషా, సర్పంచు తప్పేట మేరీ, ఎంపిటిసి ప్రశాంతి, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, గ్రామ వైసిపి నాయకులు సుదర్శన్‌రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. మండ లంలోని మాలపాడు సచి వాలయం పరిధిలోని పి.వెంకటాపురం గ్రామం లో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు రవికుమార్‌రెడ్డి, జడ్పిటిసి తమ్మిశెట్టి బాలయ్య, నాయకులు రామచంద్రారెడ్డి, పుల్లారెడ్డి, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లేగ దూడల యజమానులకు అవగాహన

ప్రజాశక్తి - జమ్మలమడుగు

లేగ దూడలకు నులిపురుగుల మందు తాపుతున్న వైద్యులు

లేగ దూడల పశువుల యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు గూడెం చెరువు పశుసంవర్ధక శాఖ డాక్టర్ జి.జాన్ సుధాకర్ పేర్కొన్నారు. మం డలం లోని పి.బొమ్మేపల్లి గ్రామం లో డిఎల్‌డిఎ కడప ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, డాక్టర్ వెంకట్రామిరెడ్డి ఆధ్వ ర్యంలో కృత్రిమ గర్భ ధారణ ద్వారా జన్మించిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేగ దూడల పెంపకం, టీకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సకాలంలో లేగ దూడలకు నులి పురుగుల మందులు తాపడం గురించి, ఆరోగ్య సూత్రాల గురించి పశు వుల యజమానులకు అవగాహన కల్పించామన్నారు. ఆరోగ్యంగా ఉన్న దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బొమ్మేపల్లి గ్రామ సర్పంచు రామ్నాథ్‌రెడ్డి, డాక్టర్ శివరామిరెడ్డి, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ రాఘవేంద్ర, మోహన్ నాయక్ , ప్రభురాం పాల్గొన్నారు.

జగన్ పాలనలో పెరిగిన ధరలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని టిఏ పల్లి గ్రామ పంచాయతీలో మండల టిడిపి నాయకుడు ఎల్.రవి శంకర్‌రెడ్డి అధ్యర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలుగుదేశం హయాంలో పుట్టా సుధాకర్ యాదవ్ కృషితో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, మంచినీటి సౌకర్యాలను కల్పించారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు సుబ్బారాయుడు, ఎల్. మోహన్‌రెడ్డి, కొండారెడ్డి, రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, మనోజ్‌కుమార్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, వెంకటరాముడు, రవీంద్రరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పీరారెడ్డి, వెంకటసుబ్బయ్య, పెద్ద కొండారెడ్డి, శ్రీకాంత్, భాస్కర్, శివారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా కడప నెహ్రూ యువ కేంద్రం, స్నేహిత అమృత హస్తం సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని నగరిగుట్ట వద్ద ఉన్న ఎస్‌సి 1,2 సాంఘిక సంక్షేమ హాస్టళ్ల ఆవరణలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మొమ్మెల రాజు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు శుక్రవారం ఉదయం 9.30కు హాస్టళ్ల వద్దకు రావాలని కోరారు.

మున్సిపాల్టీలో సుందరీకరణ పనులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు టౌన్

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అత్యాధునిక వసతులతో సుందరీకరణ చేస్తున్నట్లు వైస్ చైర్మన్ బంగారురెడ్డి తెలిపారు. త్వరలో రానున్న లైటింగ్ పోల్ ప్రొద్దుటూరు పట్టణంలో గాంధీ సర్కిల్ నుండి భారత్ హోల్ సర్కిల్ వరకు డివైడర్లో అమర్చనున్న లైటింగ్ పోల్ ప్రత్యేకంగా ఇన్‌డోర్‌లో ఏర్పాటు చేయనున్నారు. లైటింగ్‌పోల్ డివైడర్ ఇప్పటికే కొత్త కాంతులతో శోభిల్లుతున్న ప్రొద్దుటూరు మరింత అందంగా తీర్చిదిద్దేందుకు వైస్‌చైర్మన్ బంగారురెడ్డి ప్రత్యేకకృషి చేస్తున్నారు. అందుకు నిదర్శనమే ఈ డివైడర్ లైటింగ్ పోల్స్ వీటిని ప్రత్యేకంగా ఇండోర్‌లో తయారు చేస్తున్నారు. త్వరలోనే వీటిని అమరుస్తున్నారు. అలాగే డివైడర్లలో గార్డెనింగ్ కూడా చేయనున్నట్లు ఆయన బంగారురెడ్డి తెలిపారు. ఈ పనులను గురువారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో 11వ వార్డు ఇన్‌ఛార్జి కసిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి , 2వ వార్డు గురునాథరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జమ్మలమడుగు రూరల్ : పట్టణ శివారు, పట్టణంలోని ఒక రైస్ మిల్ వద్ద గురువారం రేషన్ బియ్యాన్ని డిప్యూటీ తహశీల్దార్ నాగ సుబ్బమ్మ, విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. వాహనంలో 1519 కిలోలుగల 35 బస్తాలు, రైస్ మిల్‌లో 3435 కిలోలుగల 72 బస్తాలను స్వాధీనం చేసుకున్నారు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

ఐ.పి.నెం.67/2022

మైదుకూరు షేక్ ఇమ్రాన్. ...అర్జీదారు

-వర్సెస్-

యం.హబీబ్ బాష మరియు వగైరా. ...రెస్పాండెంట్లు

9 వ రెస్పాండెంటుకు నోటీసు

9.) సడక్ హుస్సేన్ తండ్రి బి.షేక్ షుకూర్, వ్యాపారం, ఇంటి.నెం.21/459, కె.హెచ్.యం.స్ట్రీట్, ప్రొద్దుటూరు టౌన్, వై.యస్.ఆర్.కడప జిల్లా.

పై నెంబరులో ఐ.పిలో అర్జీదారు మైదుకూరు షేక్ ఇమ్రాన్ తండ్రి లేటు యం.షేక్ హబీబ్ ఉల్లా, వ్యాపారం, నివాసం. ప్లాటు నం.1321, ఫేజ్-3, రోడ్డు నెం.27,రాగమయూరి గ్రీన్ హిల్స్,నన్నూరు గ్రామం, ఓర్వకల్లు మండలం,కర్నూలు జిల్లా అను నతడు తనను దావాళాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో ఐ.పి అర్జీ దాఖలు చేసినది. ఇందుపైన 9వ రెస్పాండెంటు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 01-05-2023వ తేది పగలు 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీపరోక్షమున పై అర్జీని విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 01-05-2023

యం.మహబూబ్ బాష,
సయ్యద్ షాహబుద్దీన్,
అర్జీదారు తరుపు న్యాయవాదులు.
కర్నూలు.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకునేనా..?

ప్రకృతి వైపరీత్యాలతో నష్టం - పరిహారం కోసం ఎదురుచూపులు

ఈదురు గాలులు, వర్షాలకు రాలిన మామిడి కాయలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - వేంపల్లె

ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు మార్కెట్లో ధరలు లేకపోవడంతో మామిడి రైతులు కుదేలవుతున్నారు. ప్రతి ఏడాది తాము నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదైనా లాభాలు వస్తాయనుకున్న మామిడి రైతుల ఆశలు అడియాశలుగానే మిగిలాయి. గతంలో వచ్చిన ఈదురు గాలులకు మామిడి పిందెలు, కాయలు రాలిపోయాయి. వర్షాల కారణంగా మంగు తెగులు ఆశించడంతో ఈ ఏడాది కూడా తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మార్చి నెలలో మామిడి ధరలు ఆకాశాన్ని అంటాల్సి ఉండగా, పాతాళానికి పడిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో ముందస్తు పూతలు కనిపించడంతో గతేడాది నవంబర్ నుంచి మామిడి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. తొలి విడతగా వచ్చిన మామిడిపూత జనవరిలో పిందెగా మారడంతో ఈ సీజన్ ఆశాజనకంగా ఉంటుందని రైతులు ఆనంద పడ్డారు. అయితే ఈదురు గాలులు, వర్షాలకు పిందె రాలిపోయింది. కొద్దిరోజులకు మళ్లీ పూత రావడంతో పంట నాణ్యత కాపాడేందుకు ఇప్పటికే 10 నుంచి 14 సార్లు పురుగు మందులు పిచికారీ చేశారు. అయినా వర్షాల రూపంలో దురదృష్టం వారిని వెంటాడింది. మామిడికాయలు నాణ్యతలేదు. ఈదురు గాలులు, వడగళ్ల వర్షాల కారణంగా మంగు తెగులుతో కాయల నాణ్యత లోపించింది. తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలు వల్ల తోటలకు తెగుళ్లు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్చి ప్రారంభంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ 37 డిగ్రీల పైబడి నమోదయ్యాయి. అయితే మార్చి చివరి వారంలో వర్షాల వాతావరణంలో తీవ్ర మార్పులు చోటుచేసుకున్నాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా నమోదు కావడం, ఉదయం పూట పొగమంచు కారణంగా మామిడిపై మంగు తెగులు వ్యాపించింది. ఉద్యానశాఖ అధికారులు వాతావరణ ఆధారిత పంటల బీమాపై కనీసం దృష్టి పెట్టడం లేదని రైతులు అంటున్నారు. దీని ఫలితంగా మార్కెట్లో ధర లేక.. మరో వైపు బీమా అమలు కాక నష్టపోతున్నామని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఈదురు గాలులతో నష్టపోయాం

ఈదురు గాలులు, వడగండ్ల వర్షాలతో మామిడి తోటల ద్వారా వచ్చే ఆదాయం భారీగా కోల్పోయాం. ఇడుపులపాయి పం చాయతీలో 12 ఎకరాల్లో మామిడి తోటను సాగు చేశాను. దాదాపు 30ఏళ్ల చెట్లు ఉన్నాయి. డిసెం బర్ నుండి జనవరి మధ్యలో వీచిన ఈదురు గాలులకు పువ్వు, పిందే, కాయలు పూర్తిగా రాలిపోయాయి. మందుల పిచికారి కోసం రూ.5 లక్షల ఖర్చు చేశా. రూ.15 లక్షల ఆదాయం వస్తుందనుకొంటే వర్షాలు, గాలులతో దెబ్బ తిన్నాం. 30 టన్నుల కాయలు రాలి పోయాయి. మామిడి కాయలకు ధరలు బాగా పలికే సమయంలో ప్రకృతి రైతులకు శాపంగా మారిం ది. ప్రభుత్వం మామిడి తోటల రైతులను ఆదుకోవాలి

- పోతిరెడ్డి శివ, రైతు, ఇడుపులపాయ.

ఉన్నతాధికారులకు నివేదికలు

ఇటీవల వీచిన ఈదురు గాలులకు దెబ్బతిన్న మామిడి తోటలకు సంబంధించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించాం. సర్వే చేపట్టగా 168 మంది రైతులకు చెందిన 155.20 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. కాయలు రాలి పోవడంతో రైతులు బాగా నష్ట పోయారు.

- రెడ్డయ్య, ఉద్యానశాఖాధికారి, వేంపల్లె

ప్రజలకు చెప్పిందే చేశాం

- వైసిపి మైలవరం మండల ఇన్‌ఛార్జి దొడియం విష్ణువర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఏదైతే హామీలు చెప్పారో.. వాటిని అన్నిటిని చేసి చూపించాం అనే ధైర్యంతో జగనన్న మా భవిష్యత్తు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వైసిపి మైలవరం మండల ఇన్‌ఛార్జి దోడియం విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న మా భవిష్యత్తు - మా నమ్మకం.. నువ్వే జగనన్న కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 7నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి నాయకత్వంలో ఈ కార్యక్రమం జమ్మలమడుగు నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను 98శాతం పూర్తిచేసి దేశంలోనే ప్రథమ స్థానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. గత పాలకులు జగనన్న మా భవిష్యత్తు-మా నమ్మకం.. నువ్వే జగనన్న కార్యక్రమంపై విమర్శిస్తున్నారని తెలిపారు. టిడిపి ప్రజలకు 600కు పైగా హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందన్నారు. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణ మాఫీ తదితర అంశాలను అటుకెక్కించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి గడపకు ధైర్యంగా వెళ్లి తాము ప్రతి కుటుంబానికి చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజలకు మంచి చేశామని ధైర్యంగా ప్రతి గడపకు వెళ్లగలుగుతున్నామన్నారు. టిడిపి నాయకులు ప్రజలను మోసం చేసి హామీలను నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకొని వారి దగ్గరికి వెళ్లగలుగుతారని విమర్శించారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నకు ముఖ్యమంత్రి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందని, ఆ నమ్మకాన్ని సంక్షేమం, అభివృద్ధి దిశగా పాలనను కొనసాగిస్తామన్నారు. 2024 ఎన్నికల్లో వైసిపి 175 స్థానాలు కైవసం చేసుకునే దిశగా ముఖ్యమంత్రి జగన్ ముందుకు వెళుతున్నారని విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.

జగనన్న మన భవిష్యత్తు కార్యక్రమంలో వివరాలు సేకరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం : సిపిఎం

ప్రతిజ్ఞ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.అర్.అంబేద్కర్ ఆశయాలను అందరం కొనసాగిద్దామని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచేలా రాజ్యాంగాన్ని ఇష్టానుసారంగా మార్చేస్తున్నారన్నారు. దేశంలో నిత్యం దళితులు, మైనారిటీలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. మతాల, కులాల పేరుతో రాజకీయాలు చేస్తోందన్నారు. విభజన హామీలు ఒక్కటీ అమలు చేయలేదన్నారు. జిల్లాలో డాక్టర్ అచ్చెన్న హత్యపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారించి, దోషులను శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసు, ప్రసాద రెడ్డి, కృష్ణా రెడ్డి, నరేంద్ర, శ్రీను, రఘు పాల్గొన్నారు.

రెండు నెలలుగా అందని రేషన్ బియ్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

మూలన పడిన రేషన్ బియ్యం పంపిణీ వాహనం

రెండు నెలల నుండి పట్టణంలోని 7వ వార్డు ఎస్సీ కాలనీలో రేషన్ బియ్యం అందడం లేనని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ డీలర్ అవకతవకలకు పాల్పడుతున్నడంతో ఎస్సీ కాలనీ ప్రజలు బుధవారం రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందజేసి నిరసన వ్యక్తం చేశారు. రెండు నెలల నుండి రేషన్ బియ్యం పేద ప్రజలకు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న రేషన్ డీలర్‌ను గుర్తించడంలో రెవెన్యూ అధికారులు వైఫల్యం చెందారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన రేషన్ డీలర్లు జమ్మలమడుగు పట్టణంలో ఉచిత బియ్యం సైతం పంపిణీ చేయడం లేదని వామపక్షాలు ఆందోళన చేస్తున్నప్పటికీ అధికారుల్లో చలనం రావడంలేదని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇంటింటికి రేషన్ పంపిణీకి వాహనాల ద్వారా చేయాలనే సంకల్పం జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎక్కడా నెరవేరడం లేదు. ప్రారంభంలో కొన్ని నెలలు లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందించారు. ఇదే అదునుగా పట్టణంలో యజమానులు తమ వాహనాలను మూలను పెట్టారు. వాహనం వస్తుందో లేదో అని లబ్ధిదారులు రేషన్‌షాప్‌నకు పరుగులు తీస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యాన్ని సైతం గత మూడు నెలల నుండి పంపిణీ చేసిన దాఖలాలు పట్టణంలో కనిపించడం లేదు. లబ్ధిదారులు ఎవరైనా రేషన్ డీలర్‌ను ప్రశ్నిస్తే పంపిణీ చేశామని, మీరు సమయానికి రాలేకపోయారని, వచ్చేనెల కచ్చితంగా బియ్యాన్ని అందిస్తామని చెబుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు రేషన్ బియ్యం పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. 7వ వార్డులో బియ్యం పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని అధికారులను కోరుతున్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న డీలర్‌పై చర్యలు తీసుకోవాలి

పట్టణంలోని 7వ వార్డుకు చెందిన డీలర్ పేద ప్రజల బియ్యాన్ని పంపిణీ చేయడంలో అక్రమాలకు పాల్పడుతున్నారు. రెవెన్యూ అధికారులు డీలర్‌పై చర్యలు తీసుకోవాలి. రెవెన్యూ అధికారులే రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలి.

- ప్రసాద్, స్థానికుడు

రేషన్ బియ్యం పంపిణీ చేపడతాం

7వ వార్డులో డీలర్ రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదని నా దృష్టికి వచ్చింది. డీలర్‌పై చర్యలు తీసుకుంటాం. పేద ప్రజలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తాం.

- రమేష్, తహశీల్దార్, జమ్మలమడుగు

మట్టి నమూనా సేకరణలో జాగ్రత్తలు తీసుకోవాలి

సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - చాపాడు

పంట పొలాలలో మట్టి నమూనా సేకరణలు చేపట్టాలని, ఆ సమయంలో జాగ్ర త్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మైదుకూరు డివిజన్ ఎడిఎ కృష్ణమూర్తి సూచించారు. గురువారం మండల పరిధిలోని పల్లవోలు ఆర్‌బికెలో మండల వ్యవసాయ అధికారి మ్యాగీ అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ సిబ్బంది పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి, వాటిని పరీక్షలకు పంపాలన్నారు. అనంతరం ఆ వివరాలను రైతులకు తెలియ జేయాల న్నారు. మట్టి నమూనా ఆవశ్యకత గురించి శాస్త్రవేత్తలు వివరించారు. సిబ్బందికి కొన్ని మట్టి నమూనాలను సేకరించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఆర్సీ పిడి విజయలక్ష్మి, ఎపిడి పద్మలత, ఎఆర్‌సి శాస్త్రవేత్త ప్రత్యూష, కెటిసి ఎఒ శైలజ, విఎఎలు, విహెచ్‌ఎలు, ఎంపిఇఒలు పాల్గొన్నారు. **లింగాల :** రైతులు తమ పొలంలో భూసార పరీక్షలు చేయించుకోవాలని ఎఒ రమేష్ తెలిపారు. మండలంలోని పెద్ద కుడాల గ్రామంలో గురువారం రైతులకు భూసార పరీక్షలు గురించి వివరించారు. రైతులు తమ పొలంలో వేసిన పంటలకు భూమిలో సరైన నిష్పత్తిలో పోషకాలు లేనప్పుడు భూసార పరీక్షల ద్వారా నేలలో ఏ పోషకాలు తగ్గాయో గుర్తించి, అందించాలన్నారు. దీని వల్ల ఖర్చు తగ్గి, దిగుబడి పెరుగుతుందన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

పులివెందుల రూరల్ : పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను మునిసిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ముఖ్యంగా ఇంటింటి చెత్త సేకరణ వాహన వాడుక నిర్వహణ గురించి ఆటో డ్రైవ ర్‌ను అడిగి తెలుసుకున్నారు. నిత్యం ప్రతి ఇంటికెళ్లి చెత్త సేకరించాలని సూచించారు. అనంతరం భూగర్భ డ్రయినేజీ శుభ్రపరచు కార్యక్రమాన్ని పరిశీలించారు. పట్టణంలోని ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కార్మికులకు సూచించారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లర దుకాణంలో చోరీ

వేంపల్లె : స్థానిక ఆంధ్రాబ్యాంకు సమీపంలో పట్టపగలే విద్యా జనరల్ స్టోర్స్ (చిల్లరదుకాణం)లో చోరీ జరిగింది. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆంధ్ర బ్యాంకు ఎదురుగా ఉన్న చిల్లర దుకాణంలోకి చొరబడి క్యాష్ పెట్టెలో ఉన్న రూ.45 వేలు ఎత్తుకెళ్ళినట్లు దుకాణ యజమాని రామసాయి తెలిపారు. తన తల్లి వెంకట సుబ్బమ్మ ఇంట్లో భోజనం చేసే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడినట్లు బాధితులు వాపోయారు. సిసి పుటేజీలో చూడగా ముఖం సరిగా కనపడలేదని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కడప.

E.P.No. 32/2023
O.S.No. 250/2022

తుంగా కొండయ్య, తండ్రి లేట్ శేషయ్య, హిందూ, వయసు సుమారు 52 సం॥లు, డోర్‌నెం.6/182, శంకరాపురం, కడప.

...డిక్రీ హోల్డర్

Vs

దర్గా శాక్షవల్లి, తండ్రి అబ్దుల్ రహీమ్, ముస్లిం, వయసు సుమారు 42 సం॥లు, నివాసం ఫ్లాట్ నెం.206, కందుల అపార్ట్‌మెంటు, రాజారెడ్డివీధి, కడప.

...జె.డి.ఆర్.

నోటీసు

పై నెంబరు కేసును O.S.No. 250/2022 కేసు యొక్క డిక్రీని అమలుపరుచుటకు గాను దాఖలు చేసినందున ఇందు విషయమై ఆక్షేపణలు ఉన్న ఎడల 12.5.2023వ తేదీన పై కోర్టులో ఖుద్దున గానీ, వకీలు వారి ద్వారా గానీ, హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మాణము చేయుదురని తెలియజేయడమైనది.

ఆర్.సూర్యప్రకాశ్ రెడ్డి
అడ్వకేటు.

అబద్ధాలు చెప్పడం జగన్‌కు పరిపాటి : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

అబద్ధాలు చెప్పడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పరిపాటిగా మారిందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనకు ఆర్థిక బలం లేదని ఇటీవల ముఖ్యమంత్రి బహిరంగ సభలో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలోని 30 మంది ముఖ్యమంత్రుల్లో అత్యంత సంపన్నుడు జగన్‌మోహన్‌రెడ్డి, అత్యంత పేదరాలు మమత బెనర్జీ అని ఎడిఆర్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. 2019 ఎన్నికల అఫిడవిట్ వివరాల ఆధారంగా జగన్ ఆస్తి విలువ రూ.510 కోట్లు, మిగతా 29 మంది ముఖ్యమంత్రుల ఆస్తి విలువ కూడినా జగన్ కంటే తక్కువే అన్నారు. తనకు మీడియా బలం లేదని జగన్ బహిరంగ సభలో చెప్పారని సాక్షి దినపత్రిక, సాక్షి టివి జగన్‌వి అని అందరికీ తెలుసన్నారు. అబద్ధాలు చెప్పినా అతికినట్లు ఉండాలన్నారు.

16న ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఈనెల 16న మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ అండ్ ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఐదో తరగతిలో విద్యార్థులను గురుకుల పాఠశాలలో చేర్పించేందుకు ఇదివరకే తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకొని అందులో నిర్దేశించిన పరీక్ష కేంద్రానికి మాస్క్ తప్పనిసరిగా ధరించి విద్యార్థి వెళ్లాలన్నారు. బ్లూ లేదా బ్లాక్ పెన్ను తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 90104 40416ను సంప్రదించాలన్నారు.

రెండు రోజులు నీటి సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఈనెల 16, 17 తేదీల్లో జమ్మలమడుగు పట్టణ ప్రజలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దొమ్మర నంద్యాల వద్ద ఉన్న నీటి ట్యాంకులను శుభ్రం చేస్తున్నందున నీటి సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. నీటి సరఫరా నిలిపివేయు ప్రాంతాలు ఎంపీడీవో ఆఫీస్ రోడ్డు, అమ్మవారి శాల వీధి, అంబ భవాని వీధి, మచ్చర్ల వీధి, చాకలి వీధి, కమ్మరి వీధి, మార్వాడి వీధి, గడ్డ వీధి, డొంక వీధి, దుత్తలూరు నగర్, రోటరీ నగర్, సొసైటీ కాలనీ, నేతాజీ నగర్, ఎత్తువారి కాలనీ, బ్యాంకు కాలనీ, దిగువపట్నం కాలనీ, లక్ష్మీనగర్, వెంకటేశ్వర కాలనీ, భాగ్యనగర్ కాలనీ, రామిరెడ్డిపల్లె రోడ్డు, పెద్దపసుపల మోటు, టీచర్స్ కాలనీ అని ఆయన వివరించారు.

డిఎస్‌సి-98 ఉద్యోగాలను పూర్తిగా భర్తీ చేయాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన డిఎస్‌సి-98 అభ్యర్థులందరికీ న్యాయం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీలు ఉన్న 4534 టీచర్ పోస్టులు డిఎస్‌సి-98 అభ్యర్థులతో భర్తీ చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం, వాటిలో కూడా కోత విధించి 472 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించిందన్నారు. దీన్ని డివైఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాష్ట్రంలో 23 వేల టీచర్ పోస్టులు ఖాళీలున్నాయని, తాము అధికారంలోకి వస్తే వాటిని భర్తీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పటివరకు ఒక్క పోస్టును కూడా భర్తీ చేయలేదన్నారు. పైగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు పొంతనలేని లెక్కలు చెబుతూ నిబంధన సాకులు చూపుతూ నిరుద్యోగులైన యువతను గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. వైఎస్ఆర్ జిల్లాలో 580 మంది అర్హత సాధిస్తే కేవలం 170 మందికి పోస్టులు ఇవ్వడం, మిగతా వారికి అన్యాయం జరిగినట్లే అన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు విశ్వనాథ్ పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - ముద్దనూరు

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వెంకటరెడ్డి, యాదవ కాలనీలో గురువారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి తిరిగి వైసిపి వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో మండల మైనారిటీ నాయకులు అబ్దుల్ ఖాదర్, నాయకులు రంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాంబీర్, దానం, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆర్‌టిపిపి రహదారిలోని మసీదు వద్ద గురువారం భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మత పెద్దలు, మండల మైనారిటీ నాయకులు అబ్దుల్ ఖాదర్, నాయకులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సిఐ ఇబ్రహీం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

బియ్యం, నిత్యావసర సరుకులను అందిస్తున్న సిఐ ఇబ్రహీం

రిమాండ్ ఖైదీ కుటుంబానికి టూ టౌన్ సిఐ ఇబ్రహీం గురువారం బియ్యం, నిత్యావసర సరుకులను అందించి మానవత్వం చాటుకున్నరు. వివరాల్లోకి వెళితే.. లచ్చగాళ్ళ కోడూరు చిన్న ఓబులేసు, ప్రసాద్ ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో బాల గురప్ప మెడికల్ ఏజెన్సీ బిల్డింగ్ వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న పోట్లదుర్తి గ్రామానికి చెందిన పుల్లయ్యను అకారణంగా కొట్టి గాయపరిచారు. దీంతో అతను చనిపోయాడు. ఈ కేసులో ఓబులేసును రిమాండ్‌కు పంపారు. ఓబులేసుకు భార్య దుర్గ, ఒక పాప ఉంది. భర్త జైలుకు వెళ్లడంతో తినడానికి ఏమీ లేనందున తన భర్త తిరిగి వచ్చేవరకు మానవతా దృక్పథంతో టూ టౌన్ సిఐ ఇబ్రహీం ఒక రైస్ ప్యాకెట్, నిత్యవసర సరుకులు అందజేశారు. ఓబులేసు భార్య దుర్గ ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పనిచేయని ఎటిఎంలతో ఇక్కట్లు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని ఎటిఎం కేంద్రాలు నాలుగు రోజులుగా పనిచేయడం లేదు. ఈ పరిస్థితుల్లో ఖాతాదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సోమవారం ఉదయం నుండి టిఎన్‌ఆర్ హాల్ పక్కన ఉన్న ఎస్‌బిఐ ఎటిఎం కేంద్రంలో రెండు మిషన్లు ఉన్నాయి. ఇందులో ఒకటి కూడా పనిచేయలేదు. ఎస్‌బిఐదే నాగలకట్టలో ఒక మిషన్, ప్రధాన బ్యాంక్ వద్ద డిపాజిట్ మిషన్లు కూడా వేయడానికి కానీ, తీయడానికి కానీ పనిచేయని పరిస్థితి నెలకొంది. దీంతో ఖాతాదారులు ఇతర బ్యాంక్ ఎటిఎం కేంద్రాలను సంప్రదించాల్సి వస్తోంది. ఎక్కువ సార్లు పక్క ఎటిఎం మిషన్లలో నగదు డ్రా చేస్తే సర్వీస్ ఛార్జీలు పడుతున్నాయని ఖాతాదారులు వాపోతున్నారు. ఇతర ఎటి ఎంలు అందుబాటులో ఉంటూ కొంత ఊరటగా ఉందని పేర్కొంటున్నారు. వెంటనే ఎస్‌బిఐ ఎటిఎం విషన్‌లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు.

IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, KADAPA.

O.S.No. 635/2021

1) Smt.Sanapureddy Venkata Lakshumma
2) Sanapureddy Siva Konda Reddy
3) Sanapureddy Ravi Sankar Reddy
4) Sanapureddy Jaya Chandra Reddy

...Plaintiffs

Vs

D.K.Nawaz Khan, Son of D.Sardar Khan, Muslim, aged about 68 years, Business, resident of Door No.7/704, N.G.O.Colony, Kadapa City, Kadapa District.

...Defendant

NOTICE TO DEFENDANT

ఇందుమూలముగా ప్రతివాది అయిన మీకు పై దావాలో తెలియజేయడం ఏమనగా వాది నీ పై దావా దాఖలా చేసియున్నారు. సదరు దావా నీ నోటీసుకు గాను 19/4/2023వ తేదీన వాయిదా వున్నది. కావున నీకు 19/4/2023వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై తెలిపిన కోర్టు నందు స్వయముగా గాని లేక వకీలు ద్వారా గానీ హాజరై ఎటువంటి ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో రాజశ్రీ కోర్టు వారు నీ పై పరోక్షముగా తీర్మానించబడును.

// By Order of the Court //

S.SAI PRASANTH REDDY,
Advocate for Plaintiffs,
Kadapa City, Cell: 8919194943.